

పల్లె కూట విషం..!

శుద్ధ జలంలో పురుగుల మందు

పచ్చని పంటలు.. పైర గాలులు.. చిక్కటి పాలు.. మీగడ పెరుగు..! కల్మశం లేని బంధాలు..! అన్న.. అక్క.. మామ.. పెద్దయ్య.. చిన్నాయన.. ఊరంతా ఇవే పిలుపులు. కులం లేదు.. మతం లేదు.. అందరూ బంధువులే. ఉన్నవన్నీ బంధాలే. నీ చేనులో పనికి నేను.. నా చేనులో పనికి నువ్వు. ఒకరికి కష్టమొస్తే ఊరంతా అండగా నిలిచేది. అదే పల్లెటూరు. ఎక్కడి నుంచి వచ్చిందో రాజకీయ పిశాచి. బంధాలను బలితీసుకుంది. మానవత్వాన్ని మంటగలిపింది. నిష్కల్మశ హృదయాల్లో కాలకూట విషం నింపింది. చూపు.. ఆలోచన.. నడత.. అన్నింటా విషమే..! మన ఊరు.. మన మనుషులు అన్న వివేచన కోల్పోయారు. కొందరు నేరుగా నరికేసుకుంటున్నారు. ఇంకొందరు తడిగుడ్డలతో గొంతులను కోస్తున్నారు. ఊరికి మంచి చేయాల్సిన రాజకీయం.. ఉరి వేస్తోంది.

'విష రాజకీయమా..? నువ్వెప్పుడు నాశనమౌతావే..? మా పల్లెలను మాకెప్పుడు అప్పగిస్తావే..?'

వాసన రావడంతో బతికిపోయిన జనం
తుంబిగనూరులో అమానవీయ ఘటన

కణేకల్లు, జూన్ 15: నాలుగు గ్రామాలకు చెందిన దాదాపు నాలుగువేల మంది ప్రజలు తాగే నీటిలో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపారు. వాసన పసిగట్టి జనం అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. వైసీపీకి ఓట్లు వేయలేదని కోపంతో ఆ పార్టీ నాయకుడు ఒకరు ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అనంతపురం జిల్లా కణేకల్లు (రాయదుర్గం నియోజకవర్గం) మండలం తుంబిగనూరు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని ఫిల్టర్ వాటర్ కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పురుగుల మందు కలిపారు. ఖాళీ డబ్బాను అక్కడే వదిలేశారు. మంచినీటిని తీసుకెళ్లేందుకు శనివారం ఉదయం వచ్చిన స్థానికులు వాసన పసిగట్టారు. విషప్రయోగం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు.



గ్రామస్థులను విచారిస్తున్న పోలీసులు



తుంబిగనూరులోని వాటర్‌ప్లాంట్

ఊరి కోసం ఇస్తే..

2019లో సుజలాన్ గాలిమరల కంపెనీ వారు స్వచ్ఛందంగా వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసి గ్రామస్థులకు అప్పగించారు. ప్రారంభంలో టీడీపీ ఎంపీటీసీ వన్నూరుస్వామి ఆధీనంలో వాటర్‌ప్లాంట్ నిర్వహణ జరిగేది. వైసీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకుడు ఫణీంద్ర వాటర్‌ప్లాంట్‌ను స్వాధీనం చేసుకుని గ్రామస్థులకు మంచినీటిని అందిస్తున్నారు. ఇలా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు వాటర్‌ప్లాంట్‌ను ఆధీనంలోకి తీసుకుని నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. టీడీపీ అధికారంలోకి రావడంతో వాటర్‌ప్లాంట్‌ను తమకు అప్పగించాలని వైసీపీ నాయకుడు, సర్పంచ్ ఫణీంద్రను ఆ పార్టీ నాయకులు కోరారు. కానీ ఆయన అంగీకరించలేదు. దీంతో టీడీపీ నాయకులు ఎంపీడీఓకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

వైసీపీవారిపై ఆరోపణలు

వివాదం నేపథ్యంలో గ్రామస్థులు సేవించే మంచినీటిలోకి గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి విషం కలిపారు. వాటర్ ప్లాంట్ కిటికీలో నుంచి టర్మినేటర్ అనే పురుగుల మందును వేసి.. డబ్బాను అక్కడే వదిలేశారు. ప్లాంట్ వాచ్‌మన్ తిప్పయ్య గమనించి కేకలు వేయడంతో దుండగులు వెళ్లిపోయారని అంటున్నారు. కానీ వాచ్‌మన్ ఉదయం వరకు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. ప్రజలు నీటి కోసం వచ్చినపుడు రాత్రి ఇలాంటి సంఘటన జరిగిందని తెలిపాడు. సాధారణ ఎన్నికల్లో ఈ ఊరిలో టీడీపీకి 18 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీన్ని జీర్ణించుకోలేక స్థానిక వైసీపీ నాయకులే విష ప్రయోగం చేసి ఉంటారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ సంఘటనపై కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌ఐ శ్రీనివాసులు విచారణ చేపట్టారు. జరిగిన సంఘటన హేయమని, ఇందుకు బాధ్యులైన వారిని ఎట్టి పరిస్థితులలోనూ వదలబోమని డీఎస్పీ అన్నారు. తుంబిగనూరు ప్లాంట్ నీటిలో విషం కలపడంతో ప్రతిరోజూ ఇక్కడి నుంచి నీటిని తీసుకువెళ్లి సేవించే స్థానికులతోపాటు గరుడచేడు, మీండ్లపల్లి, నాగేపల్లి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.



పురుగుల మందు డబ్బాను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు





మార్కెట్ యార్డులో అమ్మకానికి వచ్చిన జీవాలు



రూ.48 వేలు పలికిన పొట్టేలు

రూ.55 వేలు పలికిన పొట్టేలు

బక్రీద్ పొట్టేల్..!

బక్రీద్ పండుగ నేపథ్యంలో పొట్టేళ్లు, మేక పోతులు భారీ ధర పలికాయి. సాధారణ పరిస్థితులలో గరిష్ఠంగా రూ.20 వేల వరకూ పలికే వీటిని పండుగ కోసం రూ.70 వేల వరకూ వెచ్చించి కొనుగోలు చేశారు. బక్రీద్ కొనుగోళ్ల కారణంగా అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డులో పశువుల సంత శనివారం కళకళలాడింది. ఆత్మకూరుకు చెందిన నాగార్జున అనే వ్యాపారి ఓ పొట్టేలును రూ.48 వేలకు విక్రయించాడు. మరో వ్యాపారి మేక పోతును రూ.50 వేలకు విక్రయించాడు. మరొక పొట్టేలు రూ.55 వేలు పలికింది. కొందరు ముందుగానే కొనుగోలు చేయడంతో గత వారం మరింత ఎక్కువ ధరలు పలికాయని వ్యాపారులు తెలిపారు. ఒక పొట్టేలును రూ.70 వేలకు విక్రయించామని వ్యాపారులు తెలిపారు. - అనంతపురం రూరల్

ఐదేళ్లు.. అన్యాయమైపోయాం..!



వైసీపీ పాలనపై రైతుల పెదవి విరుపు

- పంట నష్టపోయినా ఆదుకోలేదని ఆవేదన
- టీడీపీ హయాంలో రూ.1628 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ
- వైసీపీ పాలనలో రూ.233.74 కోట్లతో సరి
- ఇక అంతా మంచే జరుగుతుందని రైతుల విశ్వాసం

అనంతపురం అర్బన్/అనంతపురం రూరల్, జూన్ 15: వర్షాభావం, అకాల వర్షాలతో పంట నష్టపోయిన కరువు రైతులను ఆదుకోవడంలో వైసీపీ పాలకులు ఘోరంగా విఫలమయ్యారు. గత ఐదేళ్లల్లో పంటనష్టం జరిగిన సమయాల్లో వైసీపీ ప్రజాప్రతినిధులు కనీసం పొలాలకు వెళ్లి పంటను పరిశీలించి, రైతులకు భరోసానిచ్చిన దాఖలాలు లేవనే చెప్పాలి. జిల్లాలోని కొందరు రైతులకు అరకొరగా పంట నష్టపరిహారం అందించి చేతులు దులుపుకున్నారు. టీడీపీ హయాంలో పంటనష్టపోయిన ప్రతి రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకున్నారు. గతంలో టీడీపీ హయాంలో జిల్లా రైతాంగానికి రూ.1628 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేశారు. వైసీపీ పాలనలో ఉమ్మడి జిల్లాలో రూ.234.74 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీతోనే సరిపెట్టారు. దీన్ని బట్టే పంటనష్టపోయి రైతులను ఆదుకోవడంలో జగన్ విఫలమయ్యారని అర్థమవుతోంది. ఖరీఫ్, రబీ సీజన్లల్లో పంటనష్టపోయిన రైతుల తరఫున ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రీమియం డబ్బులు చెల్లించి ఉచితంగా పంటల బీమా అందించడంలోనూ నిర్లక్ష్యం వహించారు. తద్వారా జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. టీడీపీ అధికారంలోకి రాగానే కరువు జిల్లాను సస్యశ్యామలం చేస్తామని, కరువు రైతులను రాజును చేసే బాధ్యత తమదని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది ఒక్కో రైతుకు రూ.20వేలు ఆర్థిక సాయం అందించడంతో పాటు పంట నష్టపోయిన రైతులందరికీ పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ అందించి ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో రైతులకు మంచి రోజులు రానున్నాయని ఆ వర్గాలు భావిస్తున్నాయి.



బటన్ నొక్కిన ప్రతిసారీ ఆలస్యంగానే జమ

జగన్ బటన్ నొక్కిన ప్రతిసారి ఆలస్యంగానే అరకొరగా అందించే పరిహారం జమ చేస్తూ వచ్చారు. పంటనష్టం జరిగిన సీజన్ ముగిసిన వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంటామని వైసీపీ పాలకులు చెప్పుకున్నారు. కానీ, పంట నష్టపరిహారం అందించడంలో ప్రతి ఏడాది ప్రభుత్వం జాప్యం చేసింది. 2023-24 సంవత్సరం ఖరీఫ్ పంట నష్టపరిహారాన్ని విడుదల చేయడంలోనూ తీవ్ర జాప్యం చేశారు. తీరా ఎన్నికల కోడ్‌కు ముందు ఈ ఏడాది మార్చి 6న 2023-24 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 28 మండలాల్లో 1.69 లక్షల మంది రైతులకు సంబంధించి 1.79 లక్షల హెక్టార్లల్లో నష్టానికి రూ.251.2 కోట్ల పంటనష్టపరిహారాన్ని జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమలులోగా పరిహారం జమచేస్తారని రైతులు ఆశించినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ఎన్నికల పోలింగ్ తర్వాత పరిహారం రైతుల ఖాతాలకు జమకావడం మొదలైంది. ఇప్పటి దాకా ఎంత మంది రైతులకు పరిహారం అందిందో..? తెలియని దుస్థితి నెలకొంది. జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులకు పరిహారం జమ వివరాలు తెలియకుండా మొదటి నుంచి వైసీపీ ప్రభుత్వం దోబూచులాడటం గమనార్హం.

టీడీపీ హయాంలో పంట నష్టపరిహారం మంజూరు వివరాలు..!

సంవత్సరం	రైతుల సంఖ్య	ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తం (రూ.కోట్లల్లో)
2014 (కరువు)	5,79,640	రూ.567.32
2015 (అకాల వర్షం)	932	రూ.19 లక్షలు
2016 (అకాల వర్షం)	173	రూ.11 లక్షలు
2016 (కరువు)	6,25,050	రూ.1032.42
2017 (అకాల వర్షం)	5,828	రూ.7.23
2017 (రబీలో కరువు)	1154	రూ.20.78
మొత్తం	12,12,777	రూ.1628.05

వైసీపీ పాలనలో...

సంవత్సరం	రైతుల సంఖ్య	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.కోట్లల్లో)
2019-20	4,417	5.75
2020-21	16,187	19.37
2021-22	84,792	9,554
2022-23	5,432	6.4
2023-24	1,19,839	107.68
మొత్తం	2,30,667	23,474



ఒక్క రూపాయి కూడా రాలేదు

వైసీపీ పాలనలో ఒక్క రూపాయి పరిహారం కూడా ఇవ్వలేదు. ప్రతి ఏడాది ఐదెకరాల్లో వేరుశనగ పంట సాగు చేస్తున్నా. వానలు సరిగా పడకపోవడంతో పంట చేతికి అందక నష్టపోతూ వచ్చా. పంటనష్టపరిహారం జాబితాలో నా పేరున్నా వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో పరిహారం రాకుండా చేశారు. పంటనష్టపరిహారం పంపిణీలోనూ రాజకీయం చేయడం దుర్మార్గం. టీడీపీ అధికారంలోకి రావడంతో రైతుల కష్టాలు తీరుతాయని ఆశిస్తున్నాం. కరువు రైతులను ఆదుకునేలా చంద్రబాబు చొరవ చూపుతారన్న నమ్మకం ఉంది.

- బ్యాళ్ల లక్ష్మీనారాయణ, రైతు, ఊటిచెర్ల, అనంతపురం మండలం

వైసీపీ హయాంలో తీరని అన్యాయం



వైసీపీ పాలనలో కరువు జిల్లా రైతులకు తీరని అన్యాయం చేశారు. పంటనష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం దారుణం. ఐదేళ్లల్లో అరకొరగా ఇన్‌పుట్ సబ్సిడీ అందించి చేతులుదులుపుకుంది. 2023-24 ఖరీఫ్ ఇన్‌పుట్ సబ్సిడీని ఎన్నికల కోడ్ ముందు హడావుడిగా సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేసినట్లు గొప్పలు చెప్పారు. ఇప్పటి దాకా ఎంత మంది రైతులకు పరిహారం జమఅయ్యిందో ఎవరికీ తెలియడం లేదు. టీడీపీ హయాంలోనైనా కరువు రైతులను అన్ని విధాలా ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

- తరిమెల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు, ఏపీ రైతు సంఘం

ఐదేళ్లల్లో ఒక్కసారే పరిహారం



వైసీపీ పాలనలో కరువు రైతులకు ఒరిగిందేమి లేదు. నాకు 6.28 ఎకరాల పొలం ఉంది. ప్రతి ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగతోపాటు ఇతర రకాల పంటలు సాగు చేస్తున్నా. వర్షాలు సరిగా పడకపోవడంతో వరుసగా నష్టం వచ్చింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి మాత్రమే పంటనష్టపరిహారం పడింది. ఎన్నికల కౌంటింగ్‌కు ముందు రోజు ఖాతాలో జమైంది.

- శ్రీనివాసులు, రైతు, చిన్నమట్లగొంది. శింగనమల మండలం



రైతును నట్టేటముంచాడు

కరువు రైతును జగన్ నట్టేట ముంచాడు. వైసీపీ పాలనలో జిల్లా రైతాంగానికి ఒరిగిందేమిలేదు. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లల్లో పంటనష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందించి ఆదుకోవడంలో విఫలమయ్యాడు. రైతులను రాజును చేస్తామని ఆర్భాటంగా మాట్లాడటం తప్పా క్షేత్ర స్థాయిలో జగన్‌రెడ్డి చేసింది శూన్యం. రైతుల తరఫున ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి ఉచితంగా పంటల బీమా అందజేస్తామని ప్రకటించడంతోనే సరిపెట్టారు. డబ్బులు కట్టకపోవడంతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు.

- మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి, రైతు సంఘం

సేద్యానికి ఇంకొకరి బలి



ఓబులేసు (ఫైల్)

వ్యవసాయం కలిసిరాలేదు. పాతాళ గంగ కరుణించలేదు. మట్టిని నమ్ముకుంటే బతుకు భారమైంది. గొర్రెలనైనా పెంచుకుని భార్యా బిడ్డలను పోషించుకుందామని అనుకున్నాడు. వ్యాధుల బారిన పడి అవీ మృత్యువాత పడ్డాయి. అప్పుల భారం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. పూట గడవటం కష్టమైంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన యువ రైతు కుర్లపల్లి ఓబులేసు(36) ఉరి వేసుకున్నాడు. ఈ విషాద ఘటన చెన్నేకొత్తపల్లి మండలం చిన్నప్పేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఓబులేసుకు మూడున్నర ఎకరాల పొలం ఉంది. కొన్నేళ్ల నుంచి వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలను సాగుచేసేవాడు. బోరు బావిలో నీరు తగ్గడంతో పంటలను కాపాడుకునేందుకు మరిన్ని బోర్లు తవ్వించాడు. చుక్కనీరు పడకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలో అప్పులు రూ.10 లక్షలు దాటాయి. కుటుంబ పోషణ భారం కావడంతో కొన్ని గొర్రెలను కొని పెంచడం ప్రారంభించాడు. వ్యాధుల బారిన పడి అవి కూడా మృతిచెందాయి. దీంతో జీవితంపై విరక్తి చెందాడు. పొలం వద్దకు వెళ్తొస్తానని శుక్రవారం రాత్రి భార్య శ్రీతేజకు చెప్పి వెళ్లిపోయాడు. తెల్లవారేదాకా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు వెళ్లి గాలించారు. వంక గట్టున కానుగ చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. ఓబులేసుకు కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. - చెన్నేకొత్తపల్లి

ఐదు సంతకాల సంబరం

టీడీపీ జిల్లా కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



టీడీపీ జిల్లా కార్యాలయంలో చంద్రబాబుకు జై కొడుతున్న నాయకులు, వృద్ధులు, మహిళలు

అనంతపురం అర్బన్, జూన్ 15: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజే ఐదు హామీల అమలుకు చంద్రబాబు సంతకాలు చేయడంతో టీడీపీ జిల్లా కార్యాలయంలో నాయకులు సంబరాలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తదితరులు చంద్రబాబు చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. వృద్ధులు, మహిళలకు స్వీట్లు తినిపించారు. చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కూటమి ఘన విజయం సాధించి, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో ఏపీ ప్రజలకు పండుగ వచ్చిందని నాయకులు అన్నారు. ఎన్నికల హామీ మేరకు చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐదు హామీల అమలు ఫైల్‌పై సంతకాలు చేశారని అన్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పై పెట్టి యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని అన్నారు. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, యువతలో నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు చేయడం శుభపరిణామమని అన్నారు. టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్‌ల ద్వారా పేదలకు రూ.5కు భోజనం దొరికేదని అన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే వాటిని మూసివేయించి పేదల కడుపుకొట్టారని విమర్శించారు. చంద్రన్న చల్లని పాలనలో తిరిగి పేదలకు రూ.5లకే భోజనం అందిస్తామని అన్నారు.

దాడిచేసినా కేసు కట్టలేదు

యాడికి పోలీసులపై డీఎస్పీకి బాధితుడి ఫిర్యాదు



బాధితున్ని విచారిస్తున్న డీఎస్పీ

యాడికి, జూన్ 15: ఎన్నికల సమయంలో తనపై దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే యాడికి పోలీసులు కేసు నమోదు చేయలేదని డీఎస్పీ జనార్దన్‌నాయుడు ఎదుట కోనుప్పలపాడుకు చెందిన టీడీపీ వర్గీయుడు ఓబన్న ఆవేదన వ్యక్తం చేశారు. కోనుప్పలపాడుకు వెళ్లిన డీఎస్పీ.. ఓబన్నపై జరిగిన దాడి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా బాధితుడు డీఎస్పీతో మాట్లాడారు. వైసీపీ వర్గీయులు తనను ఇష్టానుసారంగా కొట్టారని, ఆ దాడిలో తనకు గాయాలయ్యాయని అన్నారు. పోలీసులు వచ్చి హాస్పిటల్‌కు పంపించారని, హాస్పిటల్ నుంచి వచ్చిన తర్వాత యాడికి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. గతంలో కూడా తనపై దాడి జరిగిందని, అప్పట్లో ఎస్పీ, కలెక్టర్ కోనుప్పలపాడుకు వచ్చారని అన్నారు. ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు తనపై మళ్లీ దాడి చేశారని తెలిపారు. తాను దళితుడని, అందుకే తనపట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై కేసు నమోదుచేసి తనకు న్యాయం చేయాలని విన్నవించారు. అనంతరం ఓబన్నను యాడికి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన డీఎస్పీ, అక్కడ విచారించి పంపించారు. తాడిపత్రిలోని తన కార్యాలయానికి ఆదివారం రావాలని డీఎస్పీ సూచించారని ఓబన్న తెలిపారు.

19 నుంచి ఐటీఐ కళాశాల అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, జూన్ 15: ఐటీఐ కళాశాలల్లో 19 నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు శనివారం జిల్లా కన్వీనర్, అనంతపురం ప్రభుత్వ ఐటీఐ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. 19న పది నుంచి 7వరకు. 20న 6.8నుంచి 5వరకు. 21న 4.8నుంచి 0వరకు పదవ తరగతి మార్కుల జీపీఏ ఆధారంగా అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. టెన్త్ మార్కులు, టీసీ, స్టడీ, కుల ధృవీకరణ, ఆధార్ ఒరిజనల్‌తోపాటు పాస్‌ఫోటో తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9866782452 నెంబర్‌కు సంప్రదించాలనని కోరారు.

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం


రుషీల్‌రెడ్డి


ధరణికుమార్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15: సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. శనివారం స్థానిక అనంత క్రీడా గ్రామం ఆర్డీటీ స్టేడియంలో అంతర్-23 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు కొనసాగాయి. కర్నూలు, నెల్లూరు జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు 27.3ఓవర్లలో 121పరుగులకు ఆలౌట్ అయ్యింది. నయాముల్లా 50 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 23.5ఓవర్లలో వికెట్ నష్టానికి 125పరుగులు చేసి 9వికెట్ల తేడాతో విజయం సాధించింది. నెల్లూరు బ్యాటర్లు రేవంత్‌రెడ్డి 53పరుగులు, నిఖిలేశ్వర్‌రెడ్డి 56పరుగులు సాధించారు. మరో మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు పోటీపడగా మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 50ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 220పరుగులు చేసింది. విజయ రామిరెడ్డి 66 పరుగులు, వాసుదేవరాజు 50పరుగులు సాధించారు. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 40.1ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. చిత్తూరు బ్యాటర్ రుషిల్‌రెడ్డి 104పరుగులు, ధరణికుమార్ 57పరుగులు చేశారు. పోటీలను క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి పర్యవేక్షించగా సెలెక్టర్లు నాగినికుమార్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణే ధ్యేయం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

అనంతపురం టౌన్, జూన్ 15: జిల్లా ప్రజలను కలవర పెడుతున్న క్యాన్సర్ వ్యాధిని నివారించడమే ధ్యేయంగా పనిచేయాలని డాక్టర్లు, సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యులు, సీహెచ్‌ఓలు, అర్బన్ ఏఎన్ఎంలకు కాన్సర్ స్క్రీనింగ్‌పై శనివారం శిక్షణ ఇచ్చారు. రొమ్ము, నోరు, గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. వాటికి స్క్రీనింగ్ పరీక్షలు ఎలా చేయాలి, ఎలా నిర్ధారించాలి, పాజిటివ్ వచ్చినవారికి చికిత్స, భవిష్యత్తులో నిర్వహించాల్సిన పరీక్షల గురించి వివరించారు. అనంతరం వైద్య కళాశాల ల్యాబ్‌కు తీసుకువెళ్లి స్క్రీనింగ్ పరీక్షలను ప్రాక్టికల్‌గా చూపించారు. ఇటీవల క్యాన్సర్ వ్యాధి వివిధ రూపాలలో వ్యాప్తి చెందుతోందని అన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడదని అన్నారు. కాన్సర్ వ్యాధిని నివారించడానికి అవకాశం ఉంటుందని, అందుకే ప్రభుత్వం ముందస్తు చర్యలకు అడుగులు వేసిందని అన్నారు. అందులో భాగంగా అందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తోందని అన్నారు. మహిళలు రొమ్ము పరీక్ష చేయించుకోవాలని, దుర్వాసనతో కూడిన తెల్లబట్ట లక్షణాలు ఉన్నపుడు వెంటనే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులు వినియోగించే పురుషులు నోటిలో ఎలాంటి పుండ్లు ఉన్నా వైద్యులను సంప్రదించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే అవసరమైన చికిత్స సులభంగా పొంది, జీవితకాలం పెంచుకోవచ్చని అన్నారు. అనుమానితులందరికీ కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, అపుడే అనుకున్న మేరకు కాన్సర్ నివారణ ఆశయం నెరవేరుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్యాన్సర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నిహారిక, డాక్టర్లు ప్రమోద్, ప్రశాంతి, రాజేంద్ర, మహేంద్ర, వైద్యశాఖ నోడల్ అధికారులు సుజాత, రవిశంకర్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త భార్యపై దాడి


గాయపడ్డ చౌడమ్మ

లేపాక్షి, జూన్ 15: మండల పరిధిలోని మామిడిమాకులపల్లిలో టీడీపీ కార్యకర్త శ్రీరాములు భార్య చౌడమ్మపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు విశ్వనాథ్ కొడవలితో దాడి చేశాడు. బాధితులు తెలిపిన మేరకు ఎన్నికల్లో ఓటమి తరువాత వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్త శ్రీరాములు ఇంటివద్ద ప్రతిరోజూ తాగి గొడవ చేస్తున్నారు. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి విశ్వనాథ్ మద్యం సేవించి గొడవకు వెళ్లాడు. అక్కడే ఉన్న శ్రీరాములు భార్య చౌడమ్మ.. తన భర్తను గదిలోకి వేసి తలుపులు వేసింది. దీంతో ఆగ్రహించిన విశ్వనాథ్ అక్కడే ఉన్న కొడవలితో చౌడమ్మపై దాడిచేశాడు. ఆమెకు రక్తగాయాలు కావడంతో భయపడి పారిపోయాడు. ఆమెను బంధువులు లేపాక్షి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్ఐ లేకపోవడంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పోలీస్ స్టేషన్‌కు శనివారం ఉదయం వెళితే.. ఎస్ఐ సెలవుపై వెళ్లారని చెప్పారు. సాయంత్రం 4 గంటల వరకు పడిగాపులు కాశారు. ఆ తరువాత స్టేషన్‌కు వచ్చిన హిందూపురం రూరల్ సీఐ ఈరన్న వారితో మాట్లాడారు. ఆస్పత్రిలో రాయి తగిలినట్లు చెప్పి చికిత్స చేయించుకున్నారు కదా అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులతో రాజీ చేసుకోవాలని, లేకపోతే కేసు నమోదు చేస్తానని బెదిరించారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా.. మాట్లాడి పంపిస్తానని అన్నారు. వివరాలు చెప్పకుండా ఫోన్ కట్‌చేశారు. తమకు ప్రాణహాని ఉందని, ఉన్నతాధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరారు.

పెద్దాసుపత్రి ఆకస్మిక తనిఖీ


ఆస్పత్రి వైద్యాధికారులతో చర్చిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్


'ఏమ్మా..డాక్టర్లు మంచిగా చూస్తున్నారా?' అంటూ పసిబిడ్డను ఎత్తుకొని బాలింతను అడుగుతున్న ఎమ్మెల్యే

వైద్యాధికారులతో ఎంపీ, ఎమ్మెల్యే సమావేశం
సమస్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశం

అనంతపురం టౌన్, జూన్ 15: జిల్లా సర్వజన వైద్యశాలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. గైనిక్ వార్డులో వసతులను పరిశీలించారు. పడకలు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సకాలంలో వస్తున్నారా..? ఔషధాలు ఇస్తున్నారా..? బేబీ కిట్లు వస్తున్నాయా..? అని బాలింతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ చాంబర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్, హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో సమస్యలను, నిధులు, ఔషధాల నిల్వలను అడిగి తెఉసుకున్నారు. నివేదిక తయారుచేసి ఇవ్వాలని వైద్యాధికారులను ఆదేశించారు.

బాధ్యతగా పనిచేయండి

ఆస్పత్రి పరిశీలనకు తరచూ వస్తుంటామని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని వైద్యాధికారులు, వైద్యులకు ఎంపీ, ఎమ్మెల్యే సూచించారు. ఆస్పత్రి ఆవరణ, అన్ని వార్డులు పరిశుభ్రతంగా ఉండేలా చూడాలని సూచించారు. సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి ఆస్పత్రికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. సమస్యలు ఉంటే చెప్పాలని, వాటిని ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసికెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని అన్నారు. టీడీపీ హయాంలో పనులు ప్రారంభమై అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేయిస్తామని అన్నారు. ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణంపై త్వరలో సమావేశం నిర్వహించుకుని, తగిన నిర్ణయం తీసుకుందామని అన్నారు. ఆస్పత్రికి 1200 పడకలు తప్పకుండా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని అన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి: జేసీ, ఎస్పీ


బక్రీద్ పండుగ సమీక్షలో మాట్లాడుతున్న జేసీ, ఎస్పీ

అనంతపురం టౌన్/క్రైం, జూన్ 15: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జాయింట్ కలెక్టరు కేతన్ గార్గ్, ఎస్పీ గౌతమి శాలి సూచించారు. ఈ నెల 17న బక్రీద్ ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈద్గాలు, దర్గాల వద్ద పరిసరాలను శుభ్రం చేయించాలని సూచించారు. ఆ రోజు ముస్లింలకు అవసరమైన వసతులు కల్పించాలని, మాంసపు వ్యర్థాలను తరలించడానికి మున్సిపల్ వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కబేళాల వద్ద గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి, పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సున్నితమైన ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నగరపాలిక కార్యాలయంలో కమిషనర్ మేఘ స్వరూప్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏర్పాట్ల గురించి సమీక్షించారు. సమీక్షలలో డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి రామసుబ్బారెడ్డి, జాయింట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ ప్రతాప్‌కుమార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి మీనాక్షి, డిప్యూటీ తహసీల్దారు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యూపీఎస్సీ ప్రిలిమ్స్

- ఏడు కేంద్రాలు.. 2,795 మంది అభ్యర్థులు
- అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్

అనంతపురం టౌన్, జూన్ 15: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రిలిమినరీ పరీక్షలు జిల్లాలో ఆదివారం నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టరు వినోద్ కుమార్ శనివారం వెల్లడించారు. జిల్లాలో 2,795మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9-30 గంటల నుంచి 11-30గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2-30గంటలనుంచి సాయంత్రం4-30వరకు పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నారు. ప్రతి సెంటర్ పర్యవేక్షణకు ఓ జిల్లా అధికారితో పాటు ఏడుగురు రూట్ ఆఫీసర్లు, మరో ఏడుగురు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు వెళ్లేటపుడు తనిఖీ చేయడానికి మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయించి, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అరగంట ముందు కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఏదో ఒక ఐడెంటీకార్డు తీసుకురావాలని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకు రాకూడదని కలెక్టరు సూచించారు. పరీక్షలకు సంబంధించి ఏసమస్య ఉన్నా పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏసమస్య వచ్చినా 8500292992 ఈనెంబరుకు ఫోన్‌చేసి తెలిపితే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

రేపు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాక



అనంతపురం జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హోదాలో జిల్లాకు తొలిసారిగా పయ్యావుల కేశవ్ రానున్నట్లు ఆ పార్టీ ముఖ్యుల ద్వారా సమాచారం అందింది. సోమవారం ఆయన జిల్లాకు వస్తున్న నేపథ్యంలో జిల్లా సరిహద్దు నుంచి భారీగా స్వాగతం పలికేందుకు ఆ పార్టీ శ్రేణులు, పయ్యావుల అభిమానులు, కూటమి నేతలు, కార్యకర్తలు సన్నాహకాల్లో నిమగ్నమయ్యారు.

విత్తన వేరుశనగ పంపిణీలో జాప్యం వద్దు

- త్వరితగతిన పంపిణీ చేయాలి
- జిల్లా వ్యవసాయాధికారికి మంత్రి సత్యకుమార్ ఆదేశం



ధర్మవరం, జూన్ 15: ధర్మవరం నియోజకవర్గంలో విత్తన వేరుశనగ పంపిణీ ఆలస్యంగా జరుగుతున్నట్లు తెలుసుకున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఫోన్‌ద్వారా జిల్లా వ్యవసాయాధికారితో సంప్రదించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. విత్తనాలు విత్తే సమయం ముగుస్తున్నా.. సకాలంలో అధికారులు విత్తన కాయలు పంపిణీచేయకుండా జాప్యం చేస్తున్నారని, దాని వల్ల పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నట్టు ఆరోగ్యశాఖ శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు నియోజకవర్గంలోని కొందరు నాయకులు సమాచారం అందించారు. ఇందుకు స్పందించిన మంత్రి శనివారం జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావుకు ఫోన్ చేసి మాట్లాడారు. విత్తన పంపిణీలో జాప్యం జరగకుండా చూడాలని మంత్రి ఆదేశించినట్టు అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనపంపిణీ జాప్యానికి కారణాలను అడిగారన్నారు. విత్తనాల పంపిణీ మండలాల వారీగా జరుగుతోందని, తాడిమర్రి మండలంలో ఇప్పటికే పంపిణీ పూర్తయిందని, ముదిగుబ్బ, బత్తలపల్లి, ధర్మవరంలో పంపిణీ చేయాల్సి ఉందని మంత్రికి వివరించామన్నారు. పంపిణీ జరగని చోట తక్షణమే పంపిణీకి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించినట్లు వ్యవసాయాధికారి తెలిపారు.

71510 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ



అనంతపురం అర్బన్, జూన్ 15: జిల్లాలోని ఆర్బీకేల్లో శనివారం 19వ రోజు విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 79615 మంది రైతులకు 71510 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 82922 మంది రైతులు 72878 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

వీధి రౌడీల్లా మాట్లాడింది మర్చిపోయారా?

వైసీపీ నేతలకు సీపీఐ జగదీష్ చురకలు

అనంతపురం విద్య, జూన్ 15: వైసీపీ నాయకుల తీరు దొంగే దొంగ అన్నట్లుగా ఉందని, గతంలో వీధి రౌడీల్లా మాట్లాడింది, వ్యవహరించిన తీరు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు మర్చిపోతే ఎలా అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ మండిపడ్డారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల మాజీ మంత్రి కొడాలి నానీ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ టీడీపీ ప్రభుత్వం, నాయకులపై విమర్శలు చేయడంపై జగదీష్ అసహనం వ్యక్తం చేశారు. కొడాలి నాని, గోరంట్ల మాధవ్ అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుని ఉద్దేశించి నానా దుర్భాషలాడటం, వ్యక్తిగత దూషణలు చేసి అవమానించారని, ఇప్పుడు వాళ్లు వాటిని గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. గతంలో చంద్రబాబు, లోకేష్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, వారి కుటుంసభ్యులను సైతం వైసీపీ నాయకులు నీచంగా మాట్లాడారన్నారు. కరోనా సమయంలో మాస్కులు అడిగిన సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి, చంపేయడం, ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేయడం, మాచర్లలో గూండాల దాడులు....ఇలా చెప్పుకుంటూ పోతే వైసీపీ అరాచకాలకు అంతేలేదన్నారు. అధికారం పోయాక ఇప్పుడు తమ కార్యకర్తలపై దాడులు అంటూ...వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని జగదీష్ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు పశ్చాత్తాపంతో తాము చేసిన అరాచకాలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

పీడ వదిలింది..!

పంచాయతీల్లో 'కూటమి' సంబరం
వైసీపీ ప్రభుత్వంలో నిధుల మళ్లింపు
తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సర్పంచ్‌లు

అనంతపురం న్యూటౌన్, జూన్ 15: వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గ్రామ స్వపరిపాలనకు అడ్డంకులు తొలగినట్లేనని మెజార్టీ సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను నాటి సీఎం జగన్ సొంత పథకాలకు మళ్లించారు. దీంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం కొందరు సొంత డబ్బులను వెచ్చించారు. తెలుగుదేశం పార్టీ మద్దతు సర్పంచ్‌లు మరిన్ని ఇబ్బందులు ఎదర్కొన్నారు. మంచి రోజులు రాకపోతాయా అని అవమానాలు భరిస్తూ మూడేళ్లుగా కాలం గడుపుతున్నారు. వైసీపీ సర్పంచ్‌ల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. గెలిచాం.. ఇక అంతా తమదే అని భావించిన వారికి జగన్ చుక్కలు చూపించారు. పైసా నిధులు లేక, ప్రజలకు ముఖం చూపించలేక పోయారు. సర్పంచ్ అని చెప్పుకునేందుకూ ఇబ్బంది పడ్డారు.

నిధుల మళ్లింపు..

పంచాయతీల ఖాతాల్లో పైసా లేకపోగా.. ఆదుకుంటాయని భావించిన కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం నవరత్నాలకు జగన్ మళ్లించారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నుంచి రూ.8,629 కోట్లు రాగా.. పంచాయతీలకు పైసా ఇవ్వలేదు. మొత్తం సొమ్మును పథకాల అమలుకు మళ్లించారు. దీంతో పంచాయతీల అభివృద్ధి అటకెక్కింది. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల పరిధిలో 1,044 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కేవలం 15 శాతం మంది టీడీపీ మద్దతుదారులు సర్పంచులుగా ఉన్నారు. మిగిలిన సర్పంచులు వైసీపీ మద్దతు దారులే. అయినా జగన్ కనికరం చూపలేదు. సొంత పార్టీ సర్పంచులకూ హ్యాండిచ్చారు. సర్పంచుగా గెలిచి, ప్రజలకు సేవ చేయాలన్న ఆసక్తి ఉన్నవారికి గడిచిన మూడేళ్ల పాలన పీడకలగా మిగిలిపోయింది.

అదొక పీడకల

రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎట్లో.. పంచాయతీకి సర్పంచ్ అట్ల. అంతటి కీలకమైన పదవి వైసీపీ పాలనలో 'పవర్ కట్' అన్నట్లుగా మారిపోయింది. పంచాయతీ ఖాతాలో పైసా లేకపోవడంతో తమకు ఓట్లు వేసిన జనం కనీస అవసరాలను కూడా సర్పంచులు తీర్చలేకపోయారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి వాటికీ నిధుల కొరత వేధించింది. కొంత మంది సర్పంచులు పరిస్థితిని చూసి సొంత డబ్బును వెచ్చించారు. ప్రజలకు ముఖం చూపించలేక.. అప్పులు తెచ్చి చేతులు కాల్చుకున్నారు. నెత్తీ నోరు బాదుకున్నా జగన్ కరుణించలేదని గతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఎంతో ఉత్సాహంతో ఎన్నికల్లో నిలబడిన తాము.. గెలిచాక ఉత్సవ విగ్రహాల్లా మారిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితిని గమనించిన టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఇక మేలు చేస్తారని సర్పంచ్‌లు భావిస్తున్నారు. పల్లెల్లో పరిపాలన గాడిన పడుతుందని, తమకు తగినన్ని నిధులు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
పల్లెల్లో తాజా పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం నివేదిక కోరింది. పంచాయతీల వనరులు, పన్నులు, నిధుల ఖర్చు, కేటాయింపులు తదితర వివరాలను అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా అధికారులు నివేదికను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

పైసా ఇవ్వలేదు..



వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వలేదు. పంచాయతీల పరిధిలో జరిగే రిజిస్ట్రేషన్లకు సంబంధించిన స్టాంపు డ్యూటీ ఫండ్ కూడా రాలేదు. పన్నుల రూపంలో అంతో ఇంతో వచ్చిన సొమ్మును విద్యుత్ చార్జీల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చింది. అభివృద్ధి పని చేయాల్సి వస్తే మేమే సొంతంగా చేయాల్సిందే. కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఉండదని అనుకుంటున్నాం.

- శివశంకర్, సర్పంచ్, చిన్నంపల్లి

ఇక మంచిరోజులు..



టీడీపీ కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వంలో కూడా టీడీపీ భాగస్వామి అయినందున నిధులు మరిన్ని వస్తాయి. రాష్ట్ర నిధులతో పాటు కేంద్రం నిధులు వస్తాయి. అభివృద్ధికి ఎక్కువ తెచ్చుకునే వెసులుబాటు ఉంది. పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి సమస్య ఉండదు.

- క్రిష్ణమూర్తి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33 వేలు పలికాయి. కనిష్ఠ ధర రూ.14 వేలు, సరాసరి ధర రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 660 టన్నుల కాయలు విక్రయానికి వచ్చాయని తెలిపారు.

బీటెక్, ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 15: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఫార్మసీ-డి ఫలితాలను విడుదల చేసినట్లు శనివారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మేలో బీటెక్ ద్వితీయ సంవత్సరం రెండవ సెమిస్టర్(ఆర్15,19). ప్రథమ సెమిస్టర్(ఆర్15,19,20) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఫార్మా-డి ఐదవ సంవత్సరం(ఆర్17) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

18, 19న కేంద్ర బృందం పర్యటన

అనంతపురం అర్బన్, జూన్ 15: కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం ఈనెల 18, 19 వ తేదీల్లో జిల్లా పర్యటనకు రానున్నట్లు సమాచారం. ఈనెల 18వతేదీన ముగ్గురు సభ్యులు కలిగిన ఇంటర్ మినిస్టీరియల్ బృందం సభ్యులు జిల్లాకు చేరుకోనున్నారు. జిల్లాలోని విడపకల్లు, కణేకల్లు, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు తదితర మండలాల్లో పర్యటించి 2023-24 రబీ సీజన్‌లో పంటనష్టం వివరాలపై ఆరా తీయనున్నట్లు తెలిసింది. ఆయా స్థానిక రైతులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారు. 2023-24 రబీ సీజన్‌లో వర్షాభావంతో పప్పుశనగతోపాటు ఇతర రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. రబీ సీజన్‌లో 37195 హెక్టార్లల్లో రూ.రూ.36.86 కోట్లు పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. కేంద్ర ఇంటర్ మినిస్టీరియల్ బృందం పర్యటన నేపథ్యంలో శనివారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ అనంతపురం ఏడీఏ రవి, టెక్నికల్ ఏఓ బాలూనాయక్‌లతో చర్చించారు. బృందం సభ్యులకు బస ఏర్పాట్లతోపాటు పర్యటనకు సంబంధించి ముందస్తు జాగ్రత్తలను క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు.

కష్టజీవుల పక్షపాతి శ్రీశ్రీ

కొనియాడిన సాహితీవేత్తలు


శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, జూన్ 15: కష్టజీవుల పక్షపాతి శ్రీశ్రీ అని పలువురు వక్తలు కొనియాడారు. ప్రముఖ కవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) వర్ధంతిని పురస్కరించుకుని శనివారం విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆయన చిత్రపటానికి మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో సాహితీకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య మాట్లాడుతూ... శ్రమజీవుల జీవితాలను పూర్తిగా ప్రేమించే హృదయం కలిగిన కవి శ్రీశ్రీ అని కొనియాడారు. అనంత సాహితీ ప్రస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశాడన్నారు. ఎస్కేయూ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర మాట్లాడుతూ మహాప్రస్థానం, మరో ప్రస్థానం, ఖడ్గసృష్టి, అనంతం, చరమరాత్రి కథలు వంటి కావ్యాలద్వారా తెలుగు సాహిత్యలోకంలో తనకంటూ ఒక యుగాన్ని సృష్టించుకున్న యుగకర్త శ్రీశ్రీ అన్నారు. కార్యక్రమంలో జాషువా సాహిత్యపీఠం ఆర్గనైజింగ్ సెక్రటరీ పూజారి ఈరన్న, విశాలాంధ్ర బుక్‌హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, శ్రీనివాసులు, సాయి, వెంకటరమణనాయుడు, వాల్మీకి పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కోరిన మర్తాడు నాయకులు



బండారు శ్రావణిశ్రీకి పుష్పగుచ్ఛం అందచేస్తున్న మర్తాడు టీడీపీ నాయకులు

గార్లదిన్నె, జూన్ 15: సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని మర్తాడు టీడీపీ నాయకులు కోరారు. శనివారం ఆమెను కలిసి సమస్యలపై విన్నవించారు. మర్తాడు ప్రధాన రహదారి ఇబ్బంది కరంగా ఉందని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గాన్ని కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఆమె వారికి హామీ ఇచ్చారు. అనంతరం హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును వారి కలిశారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోసుల సుబ్బయ్య, మాజీ కన్వీనర్ గోరకాటి వెంకటేసు, క్లస్టర్ ఇన్‌చార్జి ఆవుల శీనా, కుళ్ళాయప్ప, చలపతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే న్యాయం

దళిత సంఘాల నాయకులు



కేక్ కట్ చేసిన ఆనందాన్ని పంచుకుంటున్న దళిత సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 15: తెలుగుదేశం పార్టీతోనే దళితులకు న్యాయం జరుగుతుందని పలు దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో దళిత సంఘాలు, తెలుగు యువత ఆధ్వర్యంలో టీడీపీ అధికారంలోకి రావడంతోపాటు దళిత నాయకులకు సీట్లు కేటాయించి, గెలిపించినందుకు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు బంగి నాగ, బంగి మల్లేష్ మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన వంగలపూడి అనితకు హోం మంత్రిగా చంద్రబాబునాయుడు అవకాశం ఇవ్వడం హర్షనీయమన్నారు. ఇది దళితులకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విరూప శ్రీనివాసులు, బీసీఆర్ దాస్, కేపీ నారాయణ స్వామి, కుళ్లాయప్ప, రమేష్, రామాంజి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి, జూన్ 15: మండలంలోని ఎర్రంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అమరేంద్ర మృతికి పలువురు నాయకులు శనివారం నివాళులు అర్పించారు. నాలుగు రోజుల క్రితం పెనుబోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అమరేంద్రకు తీవ్రగాయాలయ్యాయి. నగరంలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం బెంగళూరుకు తరలిస్తుండగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ అంకేఅమరేంద్ర, తెలుగుమహిళా జిల్లా ప్రధానకార్యదర్శి రామసుబ్బమ్మ, సీకేపల్లిపంచాయతీ టీడీపీ అధ్యక్షుడు చెన్నకేశవగౌడ్, కాసశివారెడ్డి, వడ్డె దుర్గ, వరలక్ష్మీ తదితరులు నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

చెన్నేకొత్తపల్లి, జూన్ 15: పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని టీడీపీ, జనసేన మండల కన్వీనర్లు ముత్యాల్‌రెడ్డి, ఇటికోటి క్రాంతికుమార్, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర పేర్కొన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో శనివారం పదవ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి యజ్ఞేశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వలీస్వామి ఆరాధనోత్సవం

అనంతపురం కల్చరల్, జూన్ 15: నగరంలోని హెచ్ఎల్‌సీ కాలనీలో వెలసిన ఆశ్రమంలో వలీస్వామి 13వ ఆరాధనోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ ఆవరణలో వలీస్వామి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ, పూజాది కైంకర్యాలు చేశారు. అనంతరం విద్యానృసింహభారతి స్వామి భక్తులకు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. భక్తులు సామూహిక భజనలు చేశారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు సాయి ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రధాన కార్యదర్శి దేవనూరు సుందరం విజయ్‌కుమార్, చిట్టా శ్రీధర్, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, జయచంద్రారెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.



వలీస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు

బొమ్మనహాళ్, జూన్ 15: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు. వేకువజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించి వెండి కవచం అలంకరణ, పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు.

ఒకే భవంతిలో రెండు కార్యాలయాలు

అనంత అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు అక్కడే

ఎన్నికల సామగ్రి ఆ గదుల్లోనే

సిబ్బంది కూర్చోలేరు.. ప్రజలు నిల్చోలేరు

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలంటూ వినతి

అనంతపురం క్రైం, జూన్ 15: అనంతపురం నగర జనాభా రూ.2.70లక్షల పైమాటే. అనంతపురం రూరల్ మండలంలో 25 పంచాయతీలు. వీటన్నింటికీ కొన్నేళ్లుగా ఒకే తహసీల్దార్ కార్యాలయం. దశాబ్దాల తరువాత అనంతపురం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు ప్రత్యేకంగా ఏర్పాటయ్యాయి. కానీ కార్యాలయ నిర్వహణ మాత్రం ఒకే చోట నిర్వహిస్తున్నారు. ఇన్నాళ్లు ఒకే కార్యాలయం ఉండటంతో గజిబిజిగా ఉండేది. అప్పట్లో టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని హెచ్చెల్సీ కాలనీలోకి మార్చారు. దాదాపు 10 నెలల క్రితం కొత్తగా అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటైంది. ఈ తహసీల్దార్ కార్యాలయ నిర్వహణను సైతం అక్కడే జరుగుతోంది. అసలు సమస్య అక్కడే మొదలైంది. రెండు కార్యాలయాలు ఒకే చోట నిర్వహించడం ఆ గదులు సరిపోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అనంతపురం రెవెన్యూ డివిజన్(ఆర్డీఓ) అధికారులు వీటిపై స్పందించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

గుజిరీ షాపును తలపిస్తున్నవైనం...

అనంతపురం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయ నిర్వహణ ఒకే చోట నిరహించడం గందరగోళంగా మారింది. అక్కడున్న ఫైళ్లు ఇతరత్ర వ్యవహారం చూస్తే గుజిరీషాపులా కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సమస్యలపై వెళ్తే ప్రజలు ఇలా నిల్చోవాల్సిందే



తహసీల్దార్ కార్యాలయ గదుల్లో ఎన్నికల సామగ్రి

కొత్త తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు తరువాత గజిబిజిగా ఉన్న ఆ కార్యాలయ ఆవరణం మరింత దారుణంగా తయారైంది. ఒకే బిల్డింగ్‌కు రెండు బోర్డులు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. పాతఫైళ్లు, తాజా ఫైళ్లు, ఇతర వాటితో కలిపి గుట్టలుగా చేర్చారు. కొంతకాలంగా ఎన్నికల మెటీరియల్ సైతం అక్కడే ఉంచారు. దీంతో తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది అక్కడ కూర్చోడానికే లేకుండా పోయింది. ఇక ప్రజలు సైతం కార్యాలయం లోపల నిల్చోవడానికి లేదు. కేవలం ఇద్దరంటే ఇద్దరికే స్థలం సరిపోతోంది. ఇక నగర ప్రజలు వివిధ ధృవీకరణ పత్రాల కోసం వెళ్తుంటారు. అక్కడ ఏ కార్యాలయం ఎక్కడుందో తెలియక గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో ఫ్యామిలీ మెంబర్, కుల ధృవీకరణ పత్రాల కోసం తరచూ వెళ్తున్నారు. ఇంకా భూ సమస్యలపై వెళ్లే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అటు వర్షం పడితే కార్యాలయ గదుల్లో నీరు కారుతుండటం ఇరు కార్యాలయాల సిబ్బందిని ఇబ్బంది పెడుతోంది.

మార్చేదెన్నడు...?

అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు ఒకే చోట ఉండటం అటు సిబ్బందికి, నగర ప్రజలకు ఇబ్బందిగా మారడంతో ఎప్పుడు మారుస్తారనే చర్చ జరుగుతోంది. గతంలో టవర్‌క్లాక్ సమీపంలో ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం పక్క పక్కనే ఉండేవి. వాటిని కూల్చివేశారు. వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తారని చెప్పినా అమలుకు నోచుకోలేదు. ఆర్డీఓ కార్యాలయాన్ని సైతం డీఆర్‌డీఏ, డ్వామా కార్యాలయాల ఆవరణంలోని ఓ భవనంలో నిర్వహిస్తున్నారు. ఇప్పుడు కొత్త తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ ఆవరణంలో ఏర్పాటు చేయాలని సిబ్బంది కోరుతున్నారు. సంబంధిత ఆర్డీఓ కార్యాలయాల అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన అనంతపురం ఎంపీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం

సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుబాటి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15: క్రీడాభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పేర్కొన్నారు. 4వ సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్-2024 అండర్-14 బాల, బాలికల పోటీలను శనివారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్ అంటే తమకు ఇష్టమన్నారు. క్రీడలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. క్రీడలు, క్రీడాకారులకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. సహకారం అందించేందుకు తాము ముందుంటామని పేర్కొన్నారు. పీటీసీ స్టేడియం అభివృద్ధితోపాటు నగరానికి అనువైన ప్రాంతంలో అన్ని హంగులతో స్టేడియం నిర్మాణానికి కృషి



బ్యాటింగ్ ఆడుతున్న దగ్గుబాటి, చిత్రంలో అంబికా లక్ష్మీనారాయణ

చేస్తామని తెలిపారు. రాష్ట్ర టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్లుగా క్రీడలు, క్రీడాకారులను పలకరించేనాథుడే కరువయ్యారని, తమను ఆదరించాలని కోరారు. క్రీడాభివృద్ధి రాష్ట్ర, దేశ అభివృద్ధికి నాందిపలుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టెన్నిస్‌బాల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనులు ప్రారంభం

వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశం

అనంతపురం క్రైం, జూన్ 15: నగరంలో అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. పేదల కోసం గత టీడీపీ ప్రభుత్వం రూ.5కే భోజనం పేరుతో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాల పరిధిలో 17 అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వాటిని మూసివేసింది. టీడీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు నగరంలో నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్ అన్న క్యాంటీన్లను ప్రారంభించడానికి చర్యలు చేపట్టారు. నగరంలోని గుత్తిరోడ్డులోని ఐదు లైట్ల సర్కిల్‌లో, జూనియర్ కళాశాల ఎదుట, బళ్లారి బైపాస్ సర్కిల్‌లలో గతంలో నిర్వహించిన ప్రాంతాలను పరిశీలించారు. త్వరగా అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సిద్ధం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. పూర్తిస్థాయిలో నిర్వహణకు అవసరమైన పనులు వేగవంతం చేయాలన్నారు.



ఏర్పాట్లపై ఇంజనీర్లతో చర్చిస్తున్న కమిషనర్ మేఘస్వరూప్

కార్యక్రమంలో ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్‌చంద్రబోస్, అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్పాట్‌ను తనిఖీ చేసిన ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్



డీఈఓ, ఏసీతో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

అనంతపురం విద్య, జూన్ 15: ఏపీ ఓపెన్ స్కూల్ అడ్వాన్స్ సప్లిమెంటరీ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని ఏపీ స్టేట్ ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేఎస్ఆర్ క్యాంపులో జరుగుతున్న స్పాట్‌ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆన్సర్ షీట్లను సీఈ, ఏఈలు మూల్యాకనం చేసిన వాటిని పరిశీలించారు. సుమారు 21 మూల్యాంకనం చేసిన ఆన్సర్‌షీట్స్‌ను తెప్పించుకుని వాటిపై ఆరా తీశారు. అనంతరం డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్‌తో ఆయన మీడియాతో మాట్లాడారు. మూల్యాంకనం బాగా జరుగుతోందన్నారు. ఇతర జిల్లాల కంటే అనంతపురంలో సవ్యంగా సాగుతోందని అధికారులను అభినందించారు. కాగా ఆదివారంతో స్పాట్ ముగుస్తుందని అధికారులు తెలిపారు.

మున్సిపల్ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురండి

ఎంపీ, ఎమ్మెల్యేలకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి

అనంతపురం క్రైం, జూన్ 15: మున్సిపల్ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌లను ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. శనివారం వారు నగరంలో ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమస్యలను తెలియజేశారు. పరిష్కారం చూపాలని కోరారు. ఏపీటీఎఫ్ నాయకులు ఎన్.ఓబులేసు, సాయప్ప, ఖలీముల్లాఖాన్, భాగ్యరాజు, గోవర్ధన్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే చర్యలు

అనంతపురం క్రైం: ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే చర్యలు తీసుకుంటామని అనంతపురం రూరల్ సీఐ రామక్రిష్ణారెడ్డి హెచ్చరించారు. అనంతపురం రూరల్ మండల పరిధిలో గత కొన్ని రోజులుగా సచివాలయాలు, ఆర్బీకేల శిలాఫలకాలు ధ్వంసం చేస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి చోటుచేసుకోకూడదన్నారు. ప్రజలు సమన్వయం పాటించాలన్నారు.

వాటర్ ప్లాంటు సీజ్

ఆత్మకూరు జూన్ 15: మండల పరిధిలోని పీ సిద్దరాంపురం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంటు సీజ్ చేసినట్లు ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. గత కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీ స్థలంలో అక్రమంగా ప్లాంటు నిర్మాణం చేసి ప్రైవేటు వ్యక్తులు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామ ప్రజలు నుంచి ఫిర్యాదులు అందడంతో నోటీసు జారీ చేయడం జరిగిందన్నారు. గ్రామంలో శాంతి భద్రతలు దృష్ట్యా ప్లాంట్ నిర్వహణ వివాదస్పందంగా ఉందన్న స్థానిక ఎస్ఐ సూచన మేరకు ప్లాంటుకు సంబంధించిన వ్యక్తులు వివరాలు సమర్పించే వరకు మూతవేయడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ అనుమతులు, స్థలం వివరాలు అందజేయాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు వివరించారు.

నవజాత శిశువుల బాధ్యత అందరిదీ

- అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



ఉయ్యాలలను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

అనంతపురం విద్య, జూన్ 15: నవజాత శిశువుల సంరక్షణ బాధ్యత అందరిదీనని, వాళ్లను కాపాడుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వాసుపత్రిలోని సఖీ సెంటర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అనాథ శిశువుల కోసం ఉయ్యాలలను ఏర్పాటుచేశారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇతర అధికారులతో కలసి ఆమె ఉయ్యాలలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పుట్టిన శిశువులు అనాథలుగా మారకుండా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఐసీడీఎస్ అధికారులు నవజాత శిశువుల సంరక్షణపై మరింత ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. పిల్లల కోసం ఏయే ప్రాంతాల్లో నవజాత శిశువుల కోసం ఉయ్యాలలు ఏర్పాటుచేశారని పీడీ శ్రీదేవి, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు వనజాక్షి, మంజునాథ్, కృష్ణమాచారి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

గానగంధర్వుడికి స్వర నీరాజనం



నివాళులర్పిస్తున్న పరిషత్ కార్యవర్గం

అనంతపురం కల్చరల్, జూన్ 15: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం స్థానిక లలితకళాపరిషత్‌లో కళాకారులు స్వర నీరాజనం పలికారు. తొలుత పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ చేతులమీదుగా బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరిలో కళాకారులు ఎస్పీ బాలు పాటలను ఆలపిస్తూ గాత్ర నీరాజనం పలికారు. పరిషత్ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, రవికాంత్ రమణ, రామగోవింద్‌సాగర్, తలారి శ్రీనివాసులు, అస్లాం బాషా తదితరులు పాల్గొన్నారు.

టెంకాయలు కొట్టిన టీడీపీ శ్రేణులు

అనంతపురంరూరల్, జూన్ 15: రాప్తాడు నియోజకవర్గం ఎమ్మెల్యేగా పరిటాల సునీత గెలుపొందిన సందర్భంగా మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయితీ పిల్లిగుండ్ల కాలనీలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కాలనీలోని మౌనగిరి ఆంజనేయస్వామి ఆలయం వద్ద టెంకాలు కొట్టి..పూజలు చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సాగుకు రైతులు సిద్ధం కావాలి'



వేరుశనగ విత్తనాన్ని విత్తుతున్న ఏడీ రవి

అనంతపురంరూరల్, జూన్ 15: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంటసాగుకు సిద్ధం కావాలని అనంతపురం డివిజన్ వ్యవసాయాధికారి రవి సూచించారు. శనివారం మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో రైతులు ఆదినారాయణ, సంగప్ప పొలాల్లో వేరుశనగ, కంది విత్తును ఏఓ శశికళతో కలసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏడి రవి విత్తనాన్ని విత్తారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖచ్చితమైన సమయంలో వర్షాలు కురిశాయన్నారు. రైతులు సాగుకు సమాయత్తం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మురళీకృష్ణ, గ్రామ ఉద్యాన సహాయకులు పావని తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంతలో పెరిగిన రుసుము

గొర్రెలు, మేకలకు రూ.30 నుంచి రూ.50కి పెంపు



పెరిగిన ధరలతో ఫ్లెక్సీ

అనంతపురంరూరల్, జూన్ 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గొర్రెలు, మేకల రుసుం వసూళ్ల ధరను పెంచారు. గతంలో ఒకదానికి రూ.30వసూలు చేసేవారు. ప్రస్తుతం రూ.50కుపెంచారు. ప్రతి శనివారం గొర్రెలు, మేకల సంత జరుగుతుంది. మార్కెట్‌కు వచ్చి వెళ్లే వ్యాపారుల నుంచి ఒక్కదానికి గతంలో రూ.30 వసూలు చేయడం జరుగుతుండేది. ఇప్పుడు ఆ ధరను రూ.50 చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెంచినట్లు మార్కెట్ సిబ్బంది తెలిపారు. యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మిని అడిగేందుకు ఫోన్ చేయగా ఆమె అందుబాటులోకి రాలేదు.

నేడు కరెంటు ఉండదు..

అనంతపురంరూరల్, జూన్ 15: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ టౌన్ డి-3సెక్షన్ ఏఈఈ రామాంజినేయులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీనగర్ కాలనీ, లక్ష్మీనగర్, కొవ్వూరునగర్, ఆజాద్‌నగర్, ఐదు, ఆరో రోడ్లు, రాంనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'మీ భద్రతను మీరే చూసుకోండి..'

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 15: వృద్ధులు తమ భద్రతను స్వయంగా ఏర్పాటు చేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శనివారం పెన్షనర్ భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని వృద్ధుల స్థితిగతులు, ఆర్థిక, ఆరోగ్య సమస్యలు, భద్రతాపరమైన ఒడిదొడులను వక్తలు వివరించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ అబ్దుల్ రసూల్, నాయకులు జీసీ రాఘవన్, రామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పొలంలో చోరీ

గార్లదిన్నె, జూన్ 15: మండల పరిధిలోని కొట్టాలపల్లిలోని రైతు పురుషోత్తం పొలంలో శుక్రవారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. విద్యుత్ స్టార్టర్ పెట్టె, చీనిచెట్లకు పురుగుల మందు పిచికారి చేసే పంపు అపహరణకు గురయ్యాయి. రైతు శనివారం పొలానికి వెళ్లి చూడగా అవి కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు

రాప్తాడు, జూన్ 15: మండలంలోని మరూరు టోల్‌గేటు సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం అర్ధ రాత్రి అదుపు తప్పి కియా బస్సు ఢీకొంది. అనంతపురం నుంచి కియా కంపెనీ వద్దకు వెళుతున్న బస్సు మరూరు టోల్‌గేటు సమీపంలో అదుపు తప్పి పోల్‌ను ఢీకొంది. అదపుతప్పి ఢీకొంది. ప్రమాదంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి.

ఆర్థికసాయం అందజేత

అనంతపురం క్రైం, జూన్ 15: ఇటీవల మృతి చెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ గౌతమిశాలి ఆర్థికసాయం అందించారు. శనివారం తన చాంబర్‌లో కార్పస్‌ఫండ్, విడో ఫండ్ కింద రూ.1.50లక్షల చెక్కులను ఎస్పీ శనివారం మృతుడి భార్య రాధకు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ కార్యాలయం బీ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.


వివాహాలకు ముంటిమడుగు కేశవరెడ్డి..

గార్లదిన్నె, జూన్ 15: బుక్కరాయసముద్రం పంచాయతీ పరిధిలోని ఎల్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న కౌ సర్ వివాహానికి రూ. 5వేలు, జనచైతన్య నగర్‌కు చెం దిన సలీమా వివాహానికి రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని శనివారం ముంటిమడుగు కేశవరెడ్డి అందజేశారు.

దాడులకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ

రాప్తాడు, జూన్ 15: గ్రామాల్లో ఎవరైనా దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి హెచ్చరించారు. రాప్తాడులోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయరాదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేసినా, దాడులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

యువకుడి అదృశ్యం



కార్తీక్ బాబు

శింగనమల జూన్ 15: తన కుమారుడు కార్తీక్‌బాబు కనిపించడంలేదని తండ్రి రామకృష్ణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డిగ్రీ వరకు చదువుకున్నాడని, ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ పనులకు వెళుతుండేవాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈనెల 6న పని ఉంది అనంతపురం వెళ్లొస్తానని అని చెప్పి వెళ్లాడని, అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదని ఫిర్యాదు చేశాడు. శింగనమల పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

చరిత్రపై చెరగని సంతకాలు

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగుడు

కళ్యాణదుర్గం, జూన్ 15: రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి చరిత్రపై చెరగని సంతకాలు చేశారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం ప్రజావేదికలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. డీఎస్సీ అభ్యర్థులు, పింఛన్ లబ్ధిదారులతో కలసి చంద్రబాబు మా జీవితాల్లో వెలుగు నింపాడని కొనియాడారు. సురేంద్రబాబు మాట్లాడుతూ వృద్ధులకు పింఛన్ రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు వరకు సీఎం పెంచారని హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి మెగా డీఎస్సీ వదులుతానని నమ్మబలికి దగా డీఎస్సీ వదిలారని నిరుద్యోగులు నిప్పులు చెరిగారని విమర్శించారు. అన్ని రకాలుగా వృద్ధులను ఇబ్బందులకు గురిచేయడంతో జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు బాసటగా నిలిచినందుకు సీఎంకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటామన్నారు. ఇక నుంచి ప్రతి కార్యాలయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు కూడా వుంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీకి అధిక ప్రాధాన్యం ఇస్తూ తొలి సంతకం చేశారన్నారు. రైతులను కలవరపెట్టిన భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుకు సంబంధించి రెండో సంతకం చేశారన్నారు. జూలై 1 నుంచి పింఛన్ పెంపును వర్తింపజేస్తూ ప్రతి లబ్ధిదారుడికి రూ.7 వేలు అందించే బాధ్యతను భుజాన వేసుకున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పింఛన్ లబ్ధిదారులు, నిరుద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వృద్ధులతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

నేడు టౌన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం

గుత్తి, జూన్ 15: పట్టణంలోని దిగుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ సర్వసభ్యసమావేశాన్ని ఆదివారం స్థానిక వసుధ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్, సీఈఓ మహేశ్వరప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సమావేశం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తామన్నారు. నూతన బ్రాంచ్‌ల గురించి, లాభ, నష్టాలు, ఆస్తీ,అప్పులు, తదితర అంశాలపై చర్చిస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్ సభ్యులందరూ సమావేశానికి తప్పని సరిగా హాజరుకావాలన్నారు.

పామిడిలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది'

పామిడి, జూన్ 15: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జయంతి, సేకున్‌బీ, యశోద, హెల్పర్లు కీర్తి, మాబున్ని, దుర్గమ్మ పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం



సంబరాలు చేసుకుంటున్న న్యాయవాదులు, టీడీపీ నాయకులు

గుత్తి,జూన్ 15: ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడంపై టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో లీగల్ సెల్ జిల్లా నాయకులు సోమశేఖర్ ఆధ్వర్యంలో ల్యాండ్ టైటిలింగ్ రద్దు చేస్తూ ముఖ్యమంత్రి సంతకం చేసినందుకు సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. కృష్ణారెడ్డి, సోమశేఖర్, మనోహర్‌బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలంటూ న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేస్తూ సంతకం చేయడం హర్షణీయమన్నారు. సంపత్‌కుమార్, డాక్టర్ నాగేంద్ర, ప్రసాద్, కుళ్లాయప్ప, కృష్ణయ్య, భీమా, రమణ, భాస్కర్, రాము, తిరుమలేష్, మాజీ సర్పంచు సుంకన్న, సుధాకర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

అక్రమంగా ఉద్యోగాలు చేస్తున్న వారిని తొలగించాలి



ప్రిన్స్‌పాల్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

విడపనకల్లు, జూన్ 15: మండలంలోని ఆదర్శ పాఠశాలలో అక్రమంగా విధులు నిర్వహిస్తున్న వైసీపీకి చెందిన వారిని వెంటనే తొలగించాలని టీడీపీ మండల నాయకులు శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధరగౌడ్‌ను కోరారు. టీడీపీ సర్పంచ్‌లు చంద్రశేఖర్, తిమ్మరాజు, తిప్పారెడ్డి, వీరితో పాటు సినిమా రామాంజనేయులు, హనుమంతు, ఆదర్శ పాఠశాలకు చేరుకుని ఖాళీ పోస్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ, హాస్టల్ వార్డన్‌ను అక్రమంగా చేర్పించారన్నారు.వీరిని వెంటనే తొలగించాలన్నారు. ఈ విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునే విధంగా ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించటంపై ఎస్ఓ తులసిప్రియాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీ రామాంజినేయులు, రంగస్వామి, రాజుస్వామి, బండి శ్రీనివాసులు, యూ నాగరాజు, ఎస్ రాజేశ్ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిన తెలుగు తమ్ముళ్లు

బొమ్మనహాళ్, జూన్ 15: రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొంది మొట్టమొదటిసారిగా పట్టణానికి కాలవ శ్రీనివాసులు రావడంతో మండలం నుంచి పార్టీ నాయకులు తరలివెళ్లారు. శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించడంతో గోవిందవాడ, శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్, దర్గాహోన్నూరు తదితర గ్రామాల నుంచి తరలివెళ్లారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, బలరాంరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, ఎర్రగుంట్ల వెంకటేశులు, ముల్లంగి నారాయణస్వామి, తిమ్మరాజు, మహేంద్ర, అప్పారావు, పయ్యావుల అనిల్, పయ్యావుల మోహన్, పయ్యావుల నాగరాజు తదితరులు తరలివెళ్లారు.

కణేకల్లు: ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటిసారిగా నియోజకవర్గానికి వచ్చిన కాలవ శ్రీనివాసులుకు స్వాగతం పలికేందుకు మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. శనివారం ఆయా గ్రామాలలోని నాయకులు, కార్యకర్తలు వాహనాలను ఏర్పాటు చేసుకుని తరలివెళ్లారు. లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, ఆది, కోళేకుర్తి సుధన్, బీటీ రమేష్, బసవరాజు, వన్నారెడ్డి, షేక్‌ముజ్జు, అనిల్, కురుబ నాగరాజు, చాంద్‌బాషా, మాబుసాబ్ పాల్గొన్నారు.



కణేకల్లు నుంచి తరలి వెలుతున్న నాయకులు

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

● ర్యాలీలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు
● టీడీపీ శ్రేణుల ఘన స్వాగతం



ప్రజలకు అభివాదం చేస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, జూన్ 15: టీడీపీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. కొత్తగా ఎన్నికై తొలిసారి రాయదుర్గంలో అడుగు పెట్టిన ఎమ్మెల్యేకు శనివారం స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్, గుమ్మఘట్ట మండలాలతో పాటు పట్టణానికి చెందిన వేలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి ఆయనను స్వాగతించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద మహిళలు ఆయనకు హారతులు పట్టి నుదుట తిలకందిద్ది స్వాగతిస్తూ ముందుకు వెళ్లారు. క్రేన్‌తో గజమాల వేసి ఆహ్వానించారు. అంతకు ముందు మండలంలోని వేపరాల క్రాస్ వద్దకు ఆయన చేరుకోగానే పెద్ద కాన్వాయ్‌తో పట్టణానికి తీసుకొచ్చారు. ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ఊరేగింపును కొనసాగించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు ఇబ్బందులు ఎదుర్కొని పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటానన్నారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలను అందించడంతో పాటు, హెచ్చెల్సీ ఆధునీకరణ, ఉంతకల్లు రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తానన్నారు. లక్ష ఎకరాలకు సాగునీటిని అందించడమే ధ్యేయంగా ముందుకు వెళతానన్నారు.

ఉద్యోగుల సన్మానం: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ నాయకులు శనివారం సన్మానించారు. ఆయన నివాసంలో ఆయనను కలిసి శాలువ కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కెంచె లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు రామాంజనేయులు, పరమేశ్వరప్ప, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకుల ఆత్మీయ సన్మానం

రాయదుర్గంరూరల్: వాల్మీకి సంక్షేమ సేవాసమితి అధ్యక్షుడు బండి కిష్టప్ప, ఉపాధ్యక్షుడు మనకన్న, కోశాధికారి బండి చంద్రశేఖర్, తలారి రాజప్ప పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయ సమీపంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును సన్మానించాంచారు. తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, సభ్యులు సిద్ధలింగప్ప, హనుమంతు, మేస్త్రి, మారెన్న, అజయ్, టైలర్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీటీడీ ఆధ్వర్యంలో..: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోషియేషన్ డిపో గౌరవ అధ్యక్షులు టంకశాల హనుమంతు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసినట్లు ఎన్ఎంయూఏ నాయకుడు ఎస్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి గజమాల, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపామన్నారు. జోనల్ ఉపాధ్యక్షులు ఎంఎండీ షఫీ, దామోదర్, జిలాన్, హెచ్‌టీ స్వామి, నాగరాజు, బాలాజీ నాయక్, మైలారప్ప, మాలిక్‌బాష పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పాలన కొనసాగిస్తాం

డీ.హీరేహాళ్: ప్రజలు తనపై ఉన్న నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని వారి నమ్మకానికి అనుగుణంగానే అభివృద్ధే ధ్యేయంగా పాలన కొనసాగిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా మురడి ఆంజనేయస్వామి దర్శనం కోసం శనివారం గ్రామానికి వచ్చారు. ఎంపీటీసీ గంగాధర ఆధ్వర్యంలో ఘనంగా శ్రీనివాసులుకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాటిల్ అజయ్, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ గంగాధర, మల్లికార్జున, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



కాలవ శ్రీనివాసులును పూలమాలలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఖాళీగా దర్శనమిచ్చిన తహసీల్దార్ కార్యాలయం

● కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందక ఇబ్బందులు



అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీ

ఉరవకొండ, జూన్ 15: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం అధికారులు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిచ్చింది. కేవలం సీనియర్ అసిస్టెంట్ మాత్రమే కనిపించారు. 6వ తేదీన తహసీల్దారు శ్రీనివాసులు సెలవుపై వెళ్లారు. ఇన్‌చార్జి తహసీల్దారును నియమించకపోవడంతో రైతులు, ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెలవుపై వెళ్లడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. డిప్యూటీ తహసీల్దారు కూడా సెలవులో ఉన్నారు. పంట రుణాల కాలం కావడంతో వన్‌బీ అడంగల్‌లో సంతకాల కోసం, విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు వస్తారో, రారో తెలియక రైతులు, విద్యార్థులు కార్యాలయం వద్ద నిరీక్షించారు. అధికారులు స్పందించి తహసీల్దారును నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్రకారుడు శ్రీధరన్‌కు లైఫ్ హిస్టరీ అవార్డు

గుంతకల్లుటౌన్, జూన్ 15: పట్టణానికి చెందిన శ్రీధరన్‌కు వివేకానంద లైఫ్ హిస్టరీ అవార్డు లభించింది. అమలాపురంలోని క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 12న వివేకానంద లైఫ్ హిస్టరీ ఆల్ ఇండియా ఆన్‌లైన్ చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 150 మంది చిత్రకారులు పాల్గొన్నారు. వివేకానంద జీవిత చరిత్ర పోటీలను నిర్వహించారు. వివేకానంద చిత్రాలను గీసినందుకు శ్రీధరన్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికేట్‌ను పంపించినట్లు శ్రీధరన్ తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ, జూన్ 15: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు హారూన్ రషీద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో 2 రమాదేవికి శనివారం ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫాంలు, నోట్‌బుక్‌లు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. నాయకులు కార్తీక్, నవీన్, సురేష్ పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన

బ్రహ్మసముద్రం, జూన్ 15: స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం ఖరీఫ్ సాగుకు సమాయత్తం అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం నుంచి డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజ, యల్లప్ప హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నేల ఆరోగ్యం క్షీణించి నేటి సాగుభూములలో సేంద్రియ కర్బనం అత్యల్పస్థాయికి పడిపోయిందన్నారు. పశువుల పేడను వాడాలని, పచ్చిరొట్ట ఎరువులు భూమిలో కలియదున్నాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎస్ సరిత, వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

పెద్దవడుగూరు, జూన్15: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ రాముడు అన్నారు. మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం నాణ్యమైన విద్యతోపాటు మధ్యాహ్నభోజనం, ఉచితంగా పుస్తకాలు అందిస్తోందన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

కూడేరు, జూన్ 15: నూతన విద్యా సంవత్సరంలో 1 నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు పాఠశాలకు చేరాయి. మూడు రోజులుగా ఎంఆర్‌సీ లో ఉన్న పుస్తకాలు, బ్యాగులు, తదితర సామగ్రిని ఆయా పాఠశాలకు ఎంఈఓలు చంద్రశేఖర్, సాయికృష్ణ పంపిణీ చేశారు. 3460 మంది విద్యార్థులకు పుస్తకాలతోపాటు బ్యాగులు అందించామన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థుడికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం, జూన్ 15: మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన పశువుల వన్నూరుస్వామికి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. ఆస్పత్రుల చుట్టూ తిరిగి ఉన్న ఆస్థి మొత్తం అమ్ముకుని అనాథగా మిగిలి ఆర్థికంగా చితికిపోయాడు. విషయం తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ స్పందించి రోగికు రూ.15 వేలు ఆర్థిక సహాయం చేసి మూడు నెలల సరిపడా కిరాణ సరుకులు ఇచ్చింది. టీడీపీ గ్రామ కమిటీ నాయకులు వెంకటేశులు, మారెప్ప, రంగారెడ్డి, మల్లికార్జున, రామాంజనేయులు మల్లయ్య, తదితరులు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు



అలంకరణలో స్వామివారు

బొమ్మనహాళ్, జూన్ 15: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు. వేకువజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించి వెండి కవచం అలంకరణ, పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. మాజీ ధర్మకర్త కాశీనాథ్‌శెట్టి, అటెండర్ ఓబన్న, టీడీపీ నాయకులు బెళ్లి హనుమంతరెడ్డి, గాలి బసప్ప పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని వజ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అప్పులాపురం ఆంజనేయస్వామి ఆలయంలో, అలాగే మల్లాపురంలో విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే గంగపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ తదితర పూజలు చేశారు. భక్తులకు మహామంగళహారతి తీర్థప్రసాదాలు అందించారు.

వైభవంగా పల్లకి సేవ



స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, జూన్ 15: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకుడు

బ్రహ్మసముద్రం, జూన్ 15: మండలం కన్నేపల్లి గ్రామంలోని టీడీపీ నాయకుడు గోవిందు అమిలినేని సురేంద్రబాబు, చంద్రబాబునాయుడు గెలిస్తే తిరుపతి వెంకటేశ్వరస్వామి 216 మెట్లను మోకాళ్లతో ఎక్కుతానని మొక్కుకున్నాడు. అనుకున్న విధంగా వారు అత్యధిక మెజార్టీతో గెలిచిన వెంటనే తిరుపతి వెళ్లి మోకాళ్లతో మెట్లెక్కి మొక్కు తీర్చుకున్నారు.

సువార్త ఉజ్జీవ సభలను జయప్రదం చేయండి

రాయదుర్గంరూరల్, జూన్ 15: సువార్త ఉజ్జీవ సభలను జయప్రదం చేయాలని కళ్యాణదుర్గం తాలూకా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు చల్లా కిషోర్‌చౌదరి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని చర్చిలో సభలకు సంబంధించి పోస్టర్లను పాస్టర్ సాల్మన్, అంపన్న, సుందర్‌రాజ్, జాన్‌పాల్, దైవజనుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. 17, 18, 19వ తేదీలలో పట్టణ మార్కెట్ యార్డులో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు సభలు నిర్వహిసాత్తరన్నారు. సుందర్‌రాజ్, ఆనంద్, మల్లేష్, జోసెఫ్, కిషోర్, సాల్మన్ రాజ్, స్వరూప్, పీడీ వన్నూరప్ప పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయాలని వినతి

గుంతకల్లు టౌన్, జూన్ 15: పట్టణంలోని పాతగుంతకల్లు ఊరువాకిలి వద్దనున్న సుంకలమ్మ దేవాలయం ప్రాంతంలో సీసీ రోడ్డు వేయాలని కోరుతూ మున్సిపల్ అధికారులకు శనివారం బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్ మాట్లాడుతూ సీసీ రోడ్డు లేక పోవడంతో దేవాలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో ఆలయ ముఖద్వారం ప్రారంభం కానున్నదని, వెంటనే సీసీ రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బండారుకృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, గుర్రం సూర్యనారాయణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దోమకాటు నుంచి రక్షణతో మలేరియా నివారణ

యాడికి, జూన్ 15: దోమకాటు నుంచి రక్షించుకోవడం ద్వారా మలేరియా రాకుండా కాపాడుకోవచ్చునని మలేరియా నివారణ తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో మలేరియా నివారణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఆరోగ్య సిబ్బంది రాంప్రసాద్‌గౌడ్, జీనత్, భాగ్యలక్ష్మి, సుభాషిణి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే వదిలిపెట్టం: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దన నాయుడు

తాడిపత్రి టౌన్, జూన్ 15: ప్రభుత్వ ఆస్తులను ఎవరైనా ధ్వంసం చేస్తే వారిని వదిలిపెట్టమని డీఎస్పీ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అనంతరం పలుచోట్ల శిలాఫలకాలను ధ్వంసం చేసి ప్రభుత్వ ఆస్తులను నష్టపరుస్తున్నారన్నారు. ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. రాజకీయపరంగా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం అంటే ప్రజల ఆస్తులను చేతులారా నాశనం చేయడమే అన్నారు. సమావేశంలో సీఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోండి

యాడికి: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తాడిపత్రి డీఎస్పీ జనార్దన్‌నాయుడు సూచించారు. శనివారం యాడికి పోలీస్‌స్టేషన్‌లో బక్రీద్ నిర్వహణపై ముస్లింలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

గుత్తి: బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 17న ఈద్గా మైదనం వద్ద నిర్వహించే బక్రీద్ పండుగను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో గుత్తిఆర్ఎస్‌లోని మత పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు మంచాలు ఏర్పాటు చేయండి



విద్యార్థినులకు సూచనలిస్తున్న జడ్పీ సీఈఓ నిదియా దేవి

పామిడి, జూన్ 15: కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు మంచాలు, పరుపులు ఏర్పాటు చేయాలని జడ్పీ సీఈఓ, సమగ్ర శిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ నిదియాదేవి సూచించారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశాలను శనివారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏయే తరగతిలో ఎంతెంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, డైనింగ్ హాలు, డార్మెటరీ, వాటర్‌ప్లాంటు, పరిసర ప్రాంతాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆడుకుంటున్న విద్యార్థినులతో ముచ్చటించారు. పాఠశాలలో తరగతి గదులకు బోర్డులు, నీతి సూక్తులు, డ్రాయింగ్స్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలోనూ తరగతి గదులకు బోర్డులు రాయించాలని ఎంఈఓలకు సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర పరిశీలకులు మల్లికార్జున, ఎంఈఓలు జయానాయక్, సత్యనారాయణ, కేజీబీవీ స్పెషలాఫీసర్ సౌభాగ్య పాల్గొన్నారు.

గేట్స్‌కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

గుత్తి, జూన్ 15: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌పీటీఈఎల్‌లో జాతీయ స్థాయి ఫలితాల్లో 167వ స్థానం లభించినట్లు కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి తెలిపారు. నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాజీ ఎన్ హండ్స్ లర్నింగ్ అనే యునివర్సిటీ స్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ హ్యూమానిటీస్ సబ్జెక్టల కోసం నిర్వహించే జాతీయస్థాయి ఈ లర్నింగ్ వేదిక కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయన్నారు. ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికేషన్ కోర్సులో ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు హాజరుకాగా ఉత్తమ ప్రతిభ కనబరించినందుకు జాతీయ స్థాయిలో 167స్థానం దక్కిందన్నారు.

మహిళ అదృశ్యం



దేవి (ఫైల్)

గుత్తి, జూన్ 15: మున్సిపల్ పరిధిలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన దేవి అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె ఆయాగా పనిచేస్తోందన్నారు. కుటుంబంలో చిన్న మనస్పర్థలు రావడంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా శనివారం సాయంత్రం వెళ్లిపోయిందని కుటుంబసభ్యులు పోలీసులుకు ఫిర్యాదు చేశారు. ఎరికైనా ఆమె ఆచూకి తెలిస్తే సీఐ 9346010582, ఎస్ఐ 9346917082 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆటోలో బంగారం చోరీ

తాడిపత్రిటౌన్, జూన్ 15: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో శనివారం ఆటోలో ప్రయాణిస్తున్న నాగేశ్వరమ్మకు చెందిన మూడున్నర తులాల బంగారు నగలతోపాటు రూ.1400 నగదును గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పుట్లూరుకు చెందిన నాగేశ్వరమ్మ బ్యాగులో బంగారు నగలను ఉంచుకొని భర్త స్వగ్రామమైన కడపజిల్లా తొండూరు మండలం గంగాదేవిపల్లికి శనివారం బయలుదేరింది. పుట్లూరు నుంచి తాడిపత్రి బస్టాండ్‌కు ఆటోలో వచ్చింది. పట్టణంలోని పుట్లూరురోడ్డుకు ఆటో రాగానే మరో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆటో ఎక్కారు. ఏమైందో తెలియదు గానీ దినసరి కూరగాయల మార్కెట్ వద్దకు రాగానే ఆటోలో నుంచి దిగిపోయారు. అనంతరం ఆటో బస్టాండ్‌కు వెళ్లిపోయింది. బస్సు ఎక్కిన నాగేశ్వరమ్మ టికెట్ డబ్బులు ఇచ్చేందుకు బ్యాగును పరిశీలించగా బంగారు నగలు మాయమైనట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచు మృతి



చిన్న కొండయ్య (ఫైల్)

పుట్లూరు, జూన్ 15: మండలంలోని అరకటవేముల గ్రామానికి చెందిన మాజీ సర్పంచు చిన్న కొండయ్య (68) అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో ఆటోలో తాడిపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిసింది. కాగా కుటుంబ సభ్యులు మాత్రం వైసీపీ ఓటమి చెందగా అప్పటి నుంచి భోజనం చేయకుండా అనారోగ్యానికి గురై మృతిచెందాడని తెలిపారు.

టీడీపీ కార్యకర్త...

పామిడి, జూన్ 15: మండలంలోని పొగరూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లక్ష్మీనారాయణ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. టీడీపీ నాయకుడు ఆర్ఆర్ రమేష్ కార్యకర్త మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిరుపాలు, జనసేన మండల అధ్యక్షులు ధనుంజయ, వెంకటేష్, నాగ ఓబులేసు పాల్గొన్నారు.

బండరాయితో మోది హత్య

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 15: పట్టణంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు బండరాయితో మోది హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రక్తపు మడుగుల్లో ఉన్న వ్యక్తిని ప్రజలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చనిపోయిన వ్యక్తి గురించి పట్టణ పోలీసులు ఆరా తీయగా పట్టణానికి చెందిన కరేరు ఉమాపతి(64)గా నిర్ధారించారు. మృతుడు భిక్షమెత్తుకుంటూ జీవనం చేసేవాడని తెలిపారు. మృతునికి కుమారుడు సోమశేఖర్ ఉన్నాడు. మృతుని తమ్ముడు హనుమంతప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుతో వ్యక్తికి అస్వస్థత

గుత్తి రూరల్, జూన్ 15: మండలంలోని బసినేపల్లి గ్రామశివారు కర్నూలు జిల్లా తుగ్గలికి చెందిన ఖాదర్ బాషా అనే వ్యక్తిని పాము కాటు వేయడంతో అస్వస్థకు గురయ్యాడు. తుగ్గలికి చెందిన ఖాదర్ బాషా దర్గా వద్ద శనివారం తెల్లవారుజామున పామును తొక్కడంతో కాటువేసింది. ఆయన తీవ్ర అస్వస్థకు గురికావడంతో స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్ట్



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి

గుంతకల్లుటౌన్, జూన్ 15: పట్టణంలో సాయికృష్ణ నర్సింగ్ హోం వద్ద శుక్రవారం కర్నూలు జిల్లా వాసి మేకల శేకన్నపై దాడి చేసిన కేసులో టూటౌన్ పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి అరెస్ట్ వివరాలను వెల్లడించారు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామానికి చెందిన శేకన్నకు గుత్తిమండలం తొండపాడుకు చెందిన ఓంప్రకాస్, రజాపురానికి చెందిన కావలి వెంకటేష్, కొత్తపేట గ్రామానికి చెందిన ఆర్ రామాంజనేయులు, గుంతకల్లు మండలం కొంగనపల్లి గ్రామానికి చెందిన గూల్యం గోవర్ధన్, పాతకొత్త చెరువుకు చెందిన పుర్ర సురేందర్ గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. ఓ ల్యాండ్ విషయంలో వీరికి మనస్పర్థలు వచ్చాయన్నారు. శేకన్న సాయికృష్ణ నర్సింగ్ హోం వద్ద ఓ చిన్న గదిలో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం గురుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి శేకన్నపై కట్టెలతో దాడి చేశారన్నారు. సంఘటపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామన్నారు. శనివారం మధ్యాహ్నం టీవీ స్టేషన్ వద్ద ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. వీరిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.